క్లుప్తంగా

80 మందికి వైద్య పరీక్షలు

పెదనందిపాడు: శ్రీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 80 మందికి పరీక్షలు చేశారు. స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు అల్తాఫ్, గోమతి సేవలందించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ పీఆర్ఓ దుర్గావరప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: మద్యం మత్తులో కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో ముందు ఉన్న బైక్‌ను వేగంగా ఢీ కొట్టడంతో ఇదరు గాయపడిన నారాకోడూరులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన చందోలు అశోక్, వై.సురేష్ ద్విచక్ర వాహనంపై చేబ్రోలు వైపు వస్తున్నారు. చేబ్రోలు, నారాకోడూరు గ్రామాల మధ్య ఎస్ఆర్‌కే టెక్స్‌టైల్స్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి దూరంగా వెళ్లి నిలిచిపోయింది. ఈ ఘటనలో సురేష్, అశోక్‌లకు ముఖానికి, కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ

పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణంలో బాపట్ల బస్టాండ్ సెంటర్‌లోని ఎలక్ట్రికల్ షాపులో జరిగిన దొంగతనంలో సుమారు రూ.4లక్షలు అపహరణకు గురైనట్లు దుకాణ యజమాని ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక సెంటర్‌లోని నగేష్ ఎలక్ట్రికల్ అండ్ శానిటరీ షాపులో అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు షాపు వెనుక బాగంలోని డోరు పగలకొట్టి లోపలికి ప్రవేశించి షాపులోని రూ.నాలుగు లక్షల నగదును దొంగలించారు. చోరీకి సంబంధించిన వివరాలు షాపులోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఉదయం చోరీ జరిగిన ఘటనను గుర్తించిన షాపు యజమాని అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం బృందం ఆధారాలను సేకరించింది.

జూదరులపై కేసు నమోదు

పెదకాకాని: పేకాటాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామ శివార్లలో పేకాటాడుతున్నట్లు ఆదివారం పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేసిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,980, బైక్ స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



సంఘ లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసులురెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు విద్యాసంస్థల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆదివారం రైలుపేటలోని కన్న స్కూల్లో సమైఖ్య ప్రైవేటు లెక్చరర్స్–టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎస్పీఎల్టీఓ) ఆవిర్భావ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు భాగమేనని, వారి హక్కుల సాధన కోసం శాసన మండలి వేదికగా ప్రభుత్వంతో చర్చిస్తామని పేర్కొన్నారు. కొత్తపేట సీఐ శీలం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘానికి తమ పూర్తి సహకారాన్ని అందజేస్తామని తెలిపారు. ఎస్పీఎల్టీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సురేష్ ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పి. నాగయ్య మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయ, అధ్యాపకుల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించడమే తమ ఆశయమని, దీని కోసం కలసి వచ్చే ప్రతి ఒక్కరినీ, పార్టీలను తాము కలుపుకొని ముందుకు వెళతామని పేర్కొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వి.చంద్రశేఖర్‌బాబు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.రమేష్‌బాబు, సంయుక్త కార్యదర్శి పి.రాజారత్న కుమార్, రాష్ట్ర సమన్వయకర్త పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కె.కోటిరెడ్డి, సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాసరావు, కన్న స్కూల్ డైరెక్టర్ కన్న మాస్టారు, జిల్లా, మండలస్థాయి నాయకులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం



సుద్దపల్లిలో భారీ కేక్‌ను కట్ చేస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పక్కన పార్టీ నాయకులు



గుంటూరు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

పొన్నూరు/చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా అమలు పరుస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శనంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులు, నాయకులు, అబిమానులు మధ్య భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలో అన్ని రంగాలల్లో ముందంజలో ఉందన్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి, రైతాంగ సంక్షేమానికి, వైద్య రంగాలకు ముఖ్యమంత్రి గట్టి పునాది వేశారన్నారు. విశాఖ గ్లోబెల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కూడా 2 లేదా 3లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసినప్పటికి 13లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు, భవనం వంశీ, కుర్రా పాములు, ఆకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో..

చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానుల మధ్య ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కేక్ కట్ చేశారు. కిలారి రోశయ్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తున్నదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రజల కష్టనష్టాలను తెలుసుకుని వారి సంక్షేమం కోసం ఎన్నికల ముందు ప్రజలకు హామీలు ఇచ్చారన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 98.5శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కె.సాహితి, మాజీ ఎంపీపీ సుద్దపల్లి ఆదియ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా పాములు, చందు సాంబశివరావు, కాసు ఈశ్వర రెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, కిరణ్, అంజయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ప్రతి ఒక్కరి ధ్యేయం

పెదకాకాని: వైఎస్సార్ సీపీ విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన పెదకాకాని సెంటర్‌లో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చాగంటి మురళీరెడ్డి అధ్యక్షత వహించారు. కేక్ కత్తిరించి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి , ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుసేన్, పార్టీ నాయకులు చాగంటి మురళీరెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ఆలపాటి రాఘవ, ఆలూరి లక్ష్మీపతి, షేక్ నజీర్, శివాబత్తుని దయానంద్, బందెల ఉదయ్‌శంకర్, బండ్లమూడి బాను, నాయుడు ధను, బంగారు బుజ్జి, షేక్ షరీఫ్, ఆలా శ్రీనివాసరావు, షేక్ గౌస్, వేల్పుల నాగరాజు, పల్లెంపాటి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

పెదనందిపాడు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పెదనందిపాడు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు దాసరి పద్మారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచి దివ్వి రాంబాబు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశీంపీరా, మండల కోఆప్షన్ సభ్యుడు మస్తాన్‌వలి, ఎంపీటీసీ సభ్యులు జంగా సుందర్, పార్టీ నాయకులు దివ్వి నాగయ్య, ఎం.రవి, చెల్లి శ్రీను, అల్లడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి

పెదకాకాని: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. నంబూరు విజయభాస్కర్‌నగర్‌లో నంబూరు విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలకు అతీతంగా పరిపాలన సాగుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీకి ప్రతి ఒక్కరూ అండగా సాగాలన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాలలో చెరగనిముద్ర వేసిన సీఎం వైయస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. కేక్ కత్తిరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ గోచిపాతల శ్రీనివాసరావు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, నంబూరు విజయ్‌కుమార్, మాతంగి రవీంద్ర, మెండితోక మోహన్‌రావు, నేలపాటి రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పాతమల్లాయపాలెం కూడలి వద్ద పార్టీ శ్రేణులు వేడుకలు నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డులో పార్టీ ఆవిర్భావ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు జిల్లా ప్రసిడెంట్ షేక్ జిలాని మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఉడుతూరి ఓం ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పన్నెండు సంవత్సరాలుగా పార్టీలో అన్ని సామాజిక వర్గాలకు తగిన ప్రాధాన్యతను ఇస్తూ పార్టీ అధ్యక్షుడు తీసుకుంటున్న నిర్ణయాలు ప్రాంతీయ రాజకీయ పార్టీల్లో పెను విప్లవాలకు దారితీస్తున్నాయన్నారు. సేవాదళ్ జిల్లా ప్రసిడెంట్ ఉద్దగిరి మురళి, జెడ్పీటీసీ సభ్యుడు విప్పాల కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గట్టు విజయ్, వైస్ ప్రసిడెంట్ బి.వెంకటేశ్వరరెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ వేలూరి లక్ష్మారెడ్డి, దాసరి చెంచురామారావు, జి.శివారెడ్డి, నాగరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.



పెదకాకానిలో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు



పెదనందిపాడులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



ప్రత్తిపాడులో కేక్ కట్ చేస్తున్న షేక్ జిలాని, ఓం ప్రకాష్ రెడ్డి తదితరులు

నగరాలులో..

గుంటూరు రూరల్: రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న పార్టీ వైఎస్సార్‌సీపీ పార్టీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని కుమ్మర కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం తెలిపారు. ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరావతి రోడ్డు నగరాలులో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు.

వేడుకగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు రూరల్: దేశ రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రతి రాష్ట్రానికి మార్గదర్శకమైన పాలనను మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. ఆదివారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నగరంలోని బ్రాడీపేటలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధరాత్రి 12 గంటలకు భారీగా బాణసంచా పేల్చారు. కేక్‌లు కట్‌చేసి వేడుకలు జరిపారు. ఉదయం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఇన్‌కంటాక్స్ మాజీ కమిషనర్ మేకతోటి దయాసాగర్ దంపతులు దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. భారీ కేక్‌లను కట్‌చేసి స్వీట్లు పంచారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ప్రజలు తమ సంక్షేమం కోసం ఎదురు చూస్తున్నారని అటువంటి సంక్షేమ పాలనకు తండ్రి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక అడుగు ముందుకు వేస్తే తండ్రి కంటే రెండడుగులు ముందుకు వేసి ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు జగనన్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేస్తున్నాడన్నారు.



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోడిపందేలు వేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు

పెదకాకాని: కోడిపందేలు వేస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని కొప్పురావూరు శివార్లలో కోడిపందేలు వేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడులు చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.7,300, కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలు వేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి నాగభైరవ ఆదినారాయణ



పాతగుంటూరు: తెలుగు భాషోద్యమ నాయకుడిగా, రచయితగా, పరిశోధకుడిగా, కవిగా, బాల సాహిత్యకారుడిగా, ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ బహుముఖ ప్రజ్ఞాశాలి అని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవస్థానం పద్మావతి కల్యాణ వేదికపై ఎన్టీరంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నాగ భైరవ ఆదినారాయణ రాసిన 'మట్టి బండి' గ్రంథావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. వికాస్ విద్యాసంస్థల అధినేత పీవీ శంకరరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా బుద్ధప్రసాద్ పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ భూమిపుత్రుల కష్టాల కడగళ్లను, వారి దుర్భర జీవితాన్ని మట్టిబండి దీర్ఘ కవిత ద్వారా డాక్టర్ నాగ భైరవ కళ్లకు కట్టినట్టు వర్ణించాడని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగభైరవ ఆదినారాయణకు 'భాషావిభూషణ' బిరుదు అందించి సత్కరించారు. డాక్టర్ పెళ్లూరు సునీల్ గ్రంథ సమీక్ష చేశారు. డాక్టర్ వెనిగెట్టి సింగారావు సభను నిర్వహించగా కార్యక్రమంలో సీరం రామారావు, మక్కెన ఆంజనేయరావు, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

కాపునాడు నగరకార్యవర్గం నియామకం

పాతగుంటూరు: జిన్నాటవర్ సెంటర్‌లోని కాపునాడు జోన్–3 కార్యాలయంలో ఆదివారం నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ నాయకులు మిరియాల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాపునాడు గుంటూరు జిల్లా అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, జోన్ 3 అధ్యక్షుడు బొందలపాటి వెంకట్రావు ఆధ్వర్యంలో గుంటూరు నగర కమిటీ నియామకం జరిగింది. గుంటూరు పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శిగా రాగం సదాశివరావు, కార్యదర్శిగా డేగల వెంకటేశ్వరరావు, గుంటూరు తూర్పు అధ్యక్షుడుగా బండి రామప్రభు, మహిళా అధ్యక్షురాలుగా గంటా మౌళిక, గుంటూరు పశ్చిమ మహిళా అధ్యక్షురాలుగా గంగం మల్లేశ్వరీలను నియమించారు. అనంతరం నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందించి సత్కరించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



నంబూరులో వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండలం నంబూరు విజయభాస్కర్ నగర్‌లో డాక్టర్ గోచిపాతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేశారు. నంబూరు గ్రామంలో ఆదివారం డాక్టర్ గోచిపాత ఫౌండేషన్ స్పాన్సర్ చేసిన వాలీబాల్ కోర్టుకు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సభ్యులు గోచిపాతల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ స్థానికంగా విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు డాక్టర్ గోచిపాతల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశ నుండే చదువుతో పాటు క్రీడల్లో రాణించి క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సిబార్‌లో ముగిసిన అవగాహన సదస్సు



సిబార్ దంత వైద్య కళాశాల్లో పీజి విద్యార్థులు, ముఖ్యఅతిథులతో ఐఎస్‌పి ప్రెసిడెంట్ డాక్టర్ అభయ్ కోల్టే, డాక్టర్ హర్ ప్రీత్ సింగ్ గ్రోవర్‌లు

పెదకాకాని: దంత వైద్యరంగంలో ఆధునిక వైద్య విధానంపై అవగాహన పెంపొందించుకోవాలని ఐఎస్‌పీ ప్రెసిడెంట్ డాక్టర్ అభయ్ కోల్టే అన్నారు. గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు సిబార్ దంత వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ స్థాయి చిగుళ్ల వ్యాధుల అవగాహన సదస్సు ఆదివారం ముగిసింది. ముగింపు సదస్సులో ఇండియన్ సొసైటీ ఆఫ్ పెరియోడాంటాలజీ(ఐఎస్‌పి) ప్రెసిడెంట్ డాక్టర్ అభయ్ కోల్టే, సెక్రటరీ డాక్టర్ హర్ ప్రీత్ సింగ్ గ్రోవర్‌లు విచ్చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ అభయ్ కోల్టే మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా దంత వైద్య రంగంలో వస్తున్న ఆధునిక శస్త్ర వైద్య విధానంపై అవగాహన పెంచుకుని రాణించాలన్నారు. సదస్సులో ఐఎస్‌పీ ఈసీ మెంబర్స్ డాక్టర్ ఆశిష్‌జైన్, డాక్టర్ ఆశిష్ నిదానీ, పలు రాష్ట్రాల నుండి 10 మంది స్పీకర్స్, సదస్సుకు దేశంలోని ఆయా దంత వైద్య కళాశాల నుంచి 300 మంది పీజీ విద్యార్థిని విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఐఎస్‌పీ పరిచయ్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ డి.రవీంద్రనాథ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.రామనారాయణ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, సిబార్ డైరెక్టర్ డాక్టర్ పి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణారెడ్డి పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ సీపీగా ప్రదీప్ కుమార్

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా ప్రదీప్ కుమార్ నియమితులయ్యారు. టౌన్ ప్లానింగ్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న ప్రదీప్ కుమార్‌ను గుంటూరు నగరపాలక సంస్థ సిటీ ప్లానర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి జీఓ జారీ చేశారు. గత కొన్నేళ్లుగా సిటీ ప్లానర్ పోస్టు ఖాళీగా ఉండటంతో డీసీపీగా నియమితులైన మూర్తి ఇన్చార్జి సీపీగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టు భర్తీ చేయడంతో పరిపాలన సౌలభ్యానికి మార్గం సుగుమమైంది.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోను ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

గడప గడపకూ సంక్షేమ లబ్ధి

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- సుద్దపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



సుద్దపల్లిలో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కిలారి వెంకట రోశయ్య

సుద్దపల్లి(చేబ్రోలు): అర్హతే ప్రామాణికంగా కులమతాలకు, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామ సచివాలయం పరిధిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజు కొనసాగింది. ఎమ్మెల్యే కిలారి ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ స్థానికులతో మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే అక్కడక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నారిశెట్టి గోవిందమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.రాఘవ, మైలా హనుమంతరావు, సుద్దపల్లి ఆదియ్య, పాలడగు వెంకటేశ్వరావు, మట్టుపల్లి పోతురాజు, ఎం.సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, సుధాకర్, సుభాని, ఎస్ కిరణ్, అంజయ్య, కె.తంబి, ముసలయ్య పాల్గొన్నారు.

సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజెప్పాలి

పట్నంబజారు: విద్యార్థుల తల్లితండ్రులు వారికి విద్యతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజెప్పాలని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. పాతగుంటూరులోని వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఆదివారం మంజునాథ నాట్య క్షేత్రం వారి ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. నృత్య మండలి కళామయూరి ఆర్.మనోజ్ఞ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ తెలుగు సంస్కృతిని తెలియజేసే కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల్లో ఉన్న కళా నైపుణ్యానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అండగా నిలిచే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముస్తఫాను దుశ్శాలువ, జ్ఞాపికతో సత్కరించారు.

గీత రచనాదీపిక గ్రంథావిష్కరణ

పాతగుంటూరు: పాట, పద్య రచనలు చేయటంలో విలక్షణ కవిగా కొణతం నాగేశ్వరరావు కీర్తి గడించారని ఏఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ జి.కృపాచారి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేట కొరటాల సమావేశ మందిరంలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సాహితీ కళారత్న కొణతం నాగేశ్వరరావు రచించిన 'గీత రచనాదీపిక' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభకు డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆచార్య కృపాచారి పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మేళం బాబురావుకు తొలి పుస్తకాన్ని అందించారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గీత రచనా దీపిక భావి కీర్తనకారులకు, గేయ రచయితలకు కావలసిన సంగీత, సాహిత్య, స్వర, తాళ, లయాత్మక దిక్సూచిగా ఉందని ఆ కోవలో గ్రంథ రచన చేసిన తొలి రచయిత నాగేశ్వరరావు అని ప్రశంసించారు. తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు కేజే రమేష్ గ్రంథ సమీక్ష చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, సాహితీవేత్తలు బి.వేదయ్య, ఎంపీ జాను, బొమ్ము ఉమామహేశ్వర రెడ్డి, రావి రంగారావు, కందిమళ్ళ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.